క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

హుస్నాబాద్: పట్టణ అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను మున్సిపల్ పాలకవర్గం సన్మానించింది. ఇప్పటికే దాదాపు రూ. 30 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేశామని, ప్రస్తుతం మంజూరైన రూ. 25 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్రం, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కేశనాయక్‌తండాలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు ప్రజలందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేశనాయక్ తండా, కన్నారం గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, పట్టణాధ్యక్షుడు చింతల మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాల నిర్మాణం వేగవంతం చేయండి'

రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్వీఎం ఈఈ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నాణ్యతతో నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట డీఈఈ మధుసూదన్ ఉన్నారు.

భూంపల్లి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ మధుసూదన్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. టేక్మాల్ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. భూంపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన వీరేశ్ మిరుదొడ్డి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. వీరిని బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, మండల అధ్యక్షుడు రవి, మాజీ సర్పంచ్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

సిద్దిపేటకమాన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, మున్సిపల్ వాహనాలకు మాత్రమే చెత్త ఇవ్వాలని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. నడుస్తూ చెత్త ఏరి వేద్దాం కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని 17వ వార్డులో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం అండ

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ రహీమొద్దీన్ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాబా కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్లు ఎండీ అహ్మద్, ఇస్మాయిల్, కలీమొద్దీన్, ఫర్వేజ్ అహ్మద్, అహ్మద్, మున్సిపల్ కో ఆప్షన్ ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ ముద్ద

మర్కూక్(గజ్వేల్): ఎట్లున్నవ్ బిడ్డా.. చదువు బాగా చెబుతున్నారా.. దూరంగా ఉన్నామని రందీ పడకు. బాగా చదువుకోవాలి అంటూ తల్లిదండ్రులు తమ పిల్లలతో ఒకరోజు సరదాగా గడిపారు. శనివారం మర్కూక్ కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలు తినిపిస్తూ భవిష్యత్ కోసం అక్షరాలు నూరిపోశారు.

ట్యాంక్ ఓవర్ ఫ్లో..



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పాత కమాన్ వద్ద ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు శనివారం ఉదయం ఓవర్ ఫ్లో అయి రెండు గంటల పాటు నీరు వృథాగా పోయింది. నీరు రోడ్డుపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.



గుంత.. చింత

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్- మాలపల్లి గ్రామాల మధ్య ఎల్లమ్మ చెరువు మత్తడితో రోడ్డు కొట్టుకుపోయి లోతైన గుంత ఏర్పడింది. 20 రోజులు గడిచినా ఇప్పటివరకు ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులు స్పందించలేదు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు సైతం చేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఏపీఓను బదిలీ చేయాల్సిందే

- తొగుట మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ గాంధారి లతా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కిషన్ చందాపూర్ సర్పంచ్ నర్సింలు పట్ల అమర్యాదగా ప్రవర్తించడంపై సభ్యులు నిలదీశారు. ఏపీఓను బదిలీ చేయాలని.. చేయకుంటే మరోసారి సమావేశానికి రాలేమంటూ తేల్చిచెప్పారు. దీంతో ఎంపీపీ జోక్యం చేసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా పొదుపు సంఘాల నిధులు దుర్వినియోగమవుతున్నాయంటూ సభ్యులు ఆరోపించారు. స్త్రీనిధి కింద జమచేసిన డబ్బులు కొందరు అధికారులు కాజేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్లు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని చక్కెర ఎందుకు పంపిణీ చేయడం లేదని సభ్యులు ప్రశ్నించారు. చిన్న పిల్లలకు అందించాల్సిన గుడ్లు, బియ్యం అమ్ముకుంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. క్రమం తప్పకుండా కేంద్రాలను విజిట్ చేయాలని ఎంపీపీ సూచించారు. వరికి మొగి పురుగు తెగులు సోకి పాడైపోతున్నాయని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, ఎంపీడీఓ శ్రీధర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'దుబ్బాక రెవెన్యూ డివిజన్‌లో కలపొద్దు'

రాయపోలు(దుబ్బాక): గజ్వేల్‌కు అతి సమీపంలో ఉన్న రాయపోలు మండలాన్ని త్వరలో ఏర్పడబోయే దుబ్బాక డివిజన్‌లో చేర్చడం సరికాదని, ఐదు కిలో మీటర్ల దూరం విడిచి యాభై కిలో మీటర్లు వెళ్లాలా అంటూ మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ కల్లూరి అనిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాయపోలు మండలాన్ని దుబ్బాకలో చేరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. కాగా మండల సభలో పలు శాఖలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునయ్య, తహసీల్దార్ జహీర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు నాగరాజు, సాయికిరణ్, రాంకుమార్, ఏఓ నాగరాజు, ఏపీఎం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే ఆర్టీసీ లక్ష్యం

గజ్వేల్‌రూరల్: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ లక్ష్యమని జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ డిపోలో శనివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. అనంతరం జీపీపీ డిపోలో వీబీవో(విలేజ్ బస్ ఆఫీసర్)తో సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రాయితీలు, బస్‌పాస్‌లు, శుభ కార్యాలయాలకు బస్సులను నడిపించడం, అమావాస్య, పౌర్ణమికి గజ్వేల్ నుంచి గానుగాపూర్‌తో పాటు అరుణాచలం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్న విషయాన్ని తెలియజేయాలన్నారు. అలాగే టీ-9 టికెట్‌పై ప్రచారం కల్పించాలని సూచించారు. వీబీఓలు శ్రీధర్‌రెడ్డి, బీజేరెడ్డి, కృష్ణ, సిద్దిరాములు, ఎంఎస్‌గౌడ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ప్రక్రియతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకును సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. కొందరు రైతులకు రుణమాఫీ సొమ్ము అందినట్లు ఫోన్‌లో సందేశం వచ్చినా.. బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ కాలేదన్నారు. అలాగే ఇంట్లో ఒకరి కంటే ఎక్కువగా రుణం పొందిన రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాలేదన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా సిబ్బంది సమాధానం చెప్పాలని సూచించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



చేర్యాల: దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫొటో జర్నలిస్టులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో వివిధ దినపత్రికల్లో విధులు నిర్వర్తిస్తున్న ఫొటో జర్నలిస్టులను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

'బండి'ని కలిసిన బీజేపీ నేతలు



ఎంపీ బండి సంజయ్‌తో గజ్వేల్ బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్/కోహెడ(హుస్నాబాద్): ఇటీవల గజ్వేల్‌లో జరిగిన ఘర్షణలో జైలుకు వెళ్లి వచ్చిన బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, బీజేపీ నాయకులు మహిపాల్‌యాదవ్ కరీంనగర్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ని కలిశారు. ఈసందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. త్వరలోనే గజ్వేల్ పర్యటనకు వస్తానని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించినట్లు వారు చెప్పారు. అనంతరం ధర్మం కోసం పాటుపడుతున్న వారిని అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్, బీజేవైఎం గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ మన్నె శేఖర్, నాయకులు వెంకట్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బండి సంజయ్ సమక్షంలో కోహెడ మండల కేంద్రానికి చెందిన పెరియాల సాగర్‌రావు బీజేపీలో చేరారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జగన్నపురెడ్డి సురేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

హుస్నాబాద్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ అన్నారు. హుస్నాబాద్ పాలిటెక్నికల్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం కోర్టుల్లో న్యాయమూర్తులు మాతృభాషలోనే జడ్జిమెంట్ ఇచ్చే అవకాశం సుప్రీంకోర్టు కల్పించిందన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి పరిపాలన అందించే నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ప్రధాన కార్యదర్శి సంపత్, కళాశాల ప్రిన్సిపాల్ సతీష్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైనది



సిద్దిపేట పట్టణంలో 5కే రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు



గజ్వేల్‌లో..



హుస్నాబాద్ పట్టణంలో..

ఉత్సాహంగా 5కే రన్

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరికి ఓటుహక్కు జన్మహక్కని నిర్ణీత వయస్సుఉన్న వారు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం డిగ్రీ కళాశాల మైదానం నుంచి పాత బస్టాండ్ వరకు 5కే రన్‌ను ఏసీపీ సురేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: ఓటు హక్కు ఎంతో విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత యువతదేనని గజ్వేల్ ఏసీపీ రమేష్, ఆర్డీఓ బన్సీలాల్ పేర్కొన్నారు. శనివారం 5కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, సీఐ జాన్‌రెడ్డి, గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజు, డిప్యూటీ తహసీల్దార్ భవాని, గజ్వేల్, వర్గల్ మండలాల ఆర్‌ఐలు కృష్ణ, నాగరాజు, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో ఆర్‌ఐ రాజు నేతృత్వంలో శనివారం 5కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై వివేక్ హాజరై మాట్లాడారు. సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సాంబరాజు, చౌటపల్లి సర్పంచ్ గద్దల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో శనివారం 5కే రన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ప్రారంభించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కిరణ్, నోడల్ అధికారి సురేఖ, ఎస్సై మహేష్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఎలక్షన్ డీటీ అశోక్, హుస్నాబాద్ డీటీ సతీష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

నాచగిరికి శ్రావణ శోభ

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం శనివారం శ్రావణ శోభ సంతరించుకుంది. ముసురు వర్షం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ పుష్కరిణి, హరిద్రనది వాగులో పుణ్యస్నానాలాచరించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు. అనంతరం గర్భగుడిలో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

CHANGE OF NAME
I, KUTLA AKHILA D/o KUTLA RAVINDER, Age: 23 years, R/o. H.No. 3-11, Katkur Village of Akkannapet Mandal, Siddipet Dist., (T.S.) herewith state as follows. As per my SSC Memo (Roll No. 1533123532) my Father name was wrongly recorded as KUTLA RAVI instead of KUTLA RAVINDER. My father correct name (as per Aadhar No.592612616331) KUTLA RAVINDER.

సైబర్ నేరాలపై అవగాహన

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి మహిళా చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మీర్జాపూర్ గిరిజన బాలికల పాఠశాలలో..

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థినులు సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై మహేశ్ అన్నారు. మీర్జాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో షీటీం అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు ఉచిత వైద్య శిబిరం**

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు.

◆ **గ్రామాల అభివృద్ధే లక్ష్యం**

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సలాఖపూర్‌లో సీసీ రోడ్డును ప్రారంభించి మాట్లాడారు. పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీధర్, వార్డు సభ్యులు అనిల్, బాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు నగదు బహుమతులు**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాలలో పాశికంటి లక్ష్మమ్మ- రాందాస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 3 నుంచి 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 15 వేల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వెంకటరమణ, సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ పాకాల జయ ఇసాక్, హెచ్‌ఎం లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

◆ **రైతులు అప్రమత్తంగా ఉండాలి**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని వివిధ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్‌ను గుర్తుతెలియని దుండగులు దొంగలిస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

◆ **పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన సీపీఎస్, ఉద్యోగులకు ఇచ్చే 90 శాతం నగదు డీఏ మూడు విడతలుగా ఇచ్చే బకాయి ఏడాది అయినా మంజూరు కాలేదని ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పానుగంటి నర్సింహచారి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ బకాయిలు నాలుగు విడతలుగానే ఇచ్చారన్నారు.

◆ **ఓటర్లకు అవగాహన**

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో శనివారం ఓటర్లకు అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈవీఎం, కంట్రోల్ యూనిట్ (సీయూ), బ్యాలెట్ యూనిట్ (బీయూ), వీవీ ప్యాట్‌లు పని చేసే విధానంపై అవగాహన కల్పించారు.

◆ **అసైన్డ్ భూములను కాపాడండి**

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ భూములు కాపాడాలని కోరుతూ శనివారం పుల్లూరు గ్రామ యువకులు ఎమ్మార్వోకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని తిరుమల కొండ దేవస్థానం వద్ద గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు వారి పేరిట అసైన్డ్ పట్టాగా ఎక్కించుకుంటున్నారని వాపోయారు.

◆ **వైద్య శిబిరానికి విశేష స్పందన**

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కనకయ్య అన్నారు. శనివారం కుకునూర్‌పల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్‌లో మెడిసిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

◆ **ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య**

మర్కూక్(గజ్వేల్): విద్యార్థులకు సాంకేతిక విద్య ఎంతో అవసరమని ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిచ్‌మెంట్ ఫౌండేషన్ చైర్మన్ ప్రతిక్‌శీల అన్నారు. శనివారం మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఇంటరాక్టివ్ పానెల్ బోర్డు, విద్యార్థులకు బ్యాగులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మధుసూదన్, హెచ్‌ఎం ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న ఏఎన్‌ఎంల సమ్మె**

సిద్దిపేటజోన్: రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె శనివారం నాల్గవ రోజు కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, బీఎస్‌పీ రాష్ట్ర నాయకులు యాదగిరి, బాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులుపాల్గొన్నారు.

◆ **గురుకుల విద్యార్థిని ఆచూకీ లభ్యం**

సిద్దిపేటఅర్బన్: ఈనెల 16న కనిపించకుండా పోయిన మిట్టపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని ఆచూకీ లభించినట్టు సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ శనివారం తెలిపారు. శుక్రవారం విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు. కరీంనగర్‌లోని బంధువుల ఇంటిలో విద్యార్థిని ఉన్నట్టు సమాచారం తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990